ఆశ్చర్యం!

ప్రతి ఫొటో అడుగున ఇంకో ఫొటో అతికించి ఉంది. అవన్నీ తాము ప్రేమించే బంధు, మిత్రుల ఫొటోలన్న సంగతి గ్రహించిన ఆ శిష్యులు, బాధతో కూడిన ఆశ్చర్యంతో, ఆ ఫొటోలకి గుచ్చుకున్న డార్ట్‌ల వల్ల కళ్ళు, ముక్కు, గడ్డంలాంటివి రూపాంతరం చెంది తమ శత్రువుల ఫొటోల్లా అసహ్యంగా కనిపిస్తున్న ఆ ఫొటోల వంక బాధగా చూడసాగారు.

అకస్మాత్తుగా ఆ గది నిండా నిశ్శబ్దం అలుముకుంది.

ఆ యోగి వాళ్ళతో మృదువుగా చెప్పాడు.

"మీకు చాలా కాలంగా నేను బోధిస్తున్న సత్యాన్ని మరోసారి చెప్తున్నాను వినండి. అందరిలో ఉన్న ఆత్మ ఒక్కటే. రూపాలే వేరు. మీరు ఆ భౌతిక రూపాలని చూస్తూ, వాటితో తాదాత్మ్యం చెందినంత కాలం ఆత్మ ఒక్కటే అన్న సత్యాన్ని గ్రహించలేరు. ఓ రూపంలోని ఆత్మని బాధిస్తే, అన్ని రూపాల్లోని అదే ఆత్మని బాధించిన వారవుతారు."

శిష్యులందరి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. వారికీ విషయంలో ఇంకే బోధా అవసరం లేదని ఆ యోగి గ్రహించాడు. ఎందుకంటే వారి మనసుల్లోని ద్వేష భావం మటుమాయం అయింది.

## 60. దేవుడు ఎవరిని ప్రేమిస్తాడు?

అది కేరళలోని సముద్రం ఒడ్డున ఉన్న ఒక గ్రామం. అక్కడి చర్చ్‌కి కొత్తగా ఓ ఫాదర్ వచ్చాడు. చర్చ్‌కి వచ్చిన వారు ఆ ఫాదర్ మొదటి రోజు ఏం ప్రవచనం చెప్తాడా అని ఆసక్తిగా ఎదురుచూసారు. ఆజానుబాహువైన ఏభై ఏళ్ళ ఫాదర్‌ని ఆ గ్రామానికి చెందిన ఒకరు అందరికీ పరిచయం చేస్తూ, ఆయన తన బాల్య స్నేహితుడని చెప్పాడు. ఫాదర్ ప్రవచనాన్ని ప్రారంభించాడు.

"దేవుడు జీవులందర్నీ సమానంగా ప్రేమిస్తాడు. అయితే కొందర్ని ఇతరుల కన్నా అధికంగా ప్రేమిస్తాడు. వాళ్ళు ఎలాంటి వారై ఉండాలో ఓ చిన్న కథ ద్వారా ఇవాళ తెలుసుకుందాం. ఇది నిజంగా జరిగిన కథ అని మీకు హామీ ఇస్తున్నాను."

ఆయన చెప్పబోయే విషయం మీద అందరికీ ఆసక్తి కలిగింది.

"ఓ తండ్రి, ఓ కొడుకు, ఆ కొడుకు మిత్రుడు ముగ్గురు కలసి ఓ సారి సముద్రం మీదకి షికారుకి వెళ్ళారు. అకస్మాత్తుగా ఆకాశం నిండా దట్టంగా నల్లటి మేఘాలు కమ్మాయి. తీవ్రంగా వీచే గాలిని బట్టి, ఎగిసి పడే కెరటాలని బట్టి, తమ దిశవైపు తుఫాను ముంచుకు వస్తోందని ముగ్గురికీ అర్థం అయింది. పడవ నడపడంలో ఎంతో అనుభవం ఉన్న తండ్రికి దాన్ని నడపడం సాధ్యం కాలేదు."

ఎంతో శ్రావ్యమైన కంఠంతో ఫాదర్ చెప్పేది అంతా ఆసక్తిగా వింటున్నారు.

"వారి పడవలో రెండే రెండు చిన్న తాటిమట్టలు ఉన్నాయి. అవి ఇద్దరికే ఉపయోగిస్తాయి. పడవ మునిగిపోయే సమయం వచ్చింది. ఆ పడవలోని ఇద్దరు మాత్రమే వాటిని ఉపయోగించి ఒడ్డుకి చేరగలరు. వారు ఒకరి మొహాల వంక మరొకరు చూసుకున్నారు. ముగ్గురికీ బ్రతకాలన్న కోరిక ఉండటం సహజమేగా! తండ్రి ఓ తాటిమట్టని అందుకున్నాడు. తన కొడుకు వంక, అతని మిత్రుడి వంక వారిద్దరిలో అది ఎవరికివ్వాలా అని దీక్షగా చూసాడు. తన కొడుకు మరణించినా కోడల్ని, వారి పిల్లలని తను పోషించగలడు. కాని, కొడుకు మిత్రుడు మరణిస్తే అతని కుటుంబాన్ని పోషించడానికి ఎవరూ లేరు."

అంతటా నిశ్శబ్దం. ఫాదర్ చెప్పేది అంతా శ్రద్ధగా వింటున్నారు.

"ఆ క్షణంలో ఆ తండ్రి బాధాకరమైన నిర్ణయం తీసుకున్నాడు. ఆయన రెండో తాటిమట్టని మిత్రుడికి ఇచ్చి కొడుకుతో 'భయపడక. నీ వాళ్ళకేం కాదు. వాళ్ళ పోషణ నేను చూసుకుంటాను' అన్నాడు. వారిద్దరూ ఆ మట్టలతో సముద్రంలోకి దూకారు. ఓ పెద్ద అల రావడం, అది ఆ పడవని ముంచెత్తడం, నీళ్ళ మీద తేలుతున్న తండ్రి, మిత్రుడు చూసారు. సముద్రంలో మునిగి పోయిన కొడుకు శవమైనా లభ్యం కాలేదు."

ఫాదర్ అందరివంకా తేరిపార చూసి తను చెప్పేది ముగించాడు,

"నిస్వార్థతకి ఈ నిజ సంఘటన గొప్ప ఉదాహరణ. నిస్వార్థంగా ఉండేవాళ్ళనే జీసస్ అందరి కన్నా ఎక్కువగా ప్రేమిస్తాడు."

చర్చిలోంచి అంతా బయటికి వచ్చాక చాలామంది ఫాదర్ చెప్పిన దాని మీద చర్చించుకోసాగారు.

"అది కథే అయిఉండాలి తప్ప నిజ జీవితంలో జరిగిందంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఏ తండ్రీ తన కొడుకుని రక్షించకుండా కొడుకు మిత్రుడిని రక్షించడు."

వారి మాటలు విన్న, ఆ ఫాదర్‌ని పరిచయం చేసిన ఆయన బాల్య మిత్రుడు వారితో చెప్పాడు.

"అది నిజంగా జరిగిన కథే. అలా రక్షింపబడ్డ ఆ మిత్రుడే ఈ ఫాదర్. ఆ సంఘటన తర్వాత అతను తన సంసారాన్ని త్యజించి ఫాదర్‌గా మారాడు."

## 61. భావం ప్రధానం

ఓ రోజు కాశీ విశ్వనాధుడ్ని పార్వతి అడిగింది.

"స్వామీ! గంగానదిలో స్నానంచేస్తే సర్వ పాపాలు పోతాయంటారే? మరి నిత్యం లక్షలాదిమంది గంగా స్నానం చేస్తున్నారు కదా. మరి వీరంతా స్వర్గానికి చేరడంలేదే?"